
# ఈ పాపం ఎవ్వరిది ?

ఒక పని జరగాలంటే రాజుల కాలంలో "ఇంద్రుడు - చంద్రుడు" అని పొగిడేవారు. అలాంటి పొగడ్తలకు ఉబ్బితబ్బిబ్బయిన రాజు బహుమానాలిచ్చేవాడు.

బ్రిటిష్ రాజుల కాలం వచ్చేక కూడా అలాంటి పొగడ్తల సంప్రదాయం కొనసాగింది. అయితే, 'నువ్వు మా దేశం విడిచిపోవాలి' అని కోరుతూ బ్రిటిష్ వారిని ఎంతగా పొగిడినా ప్రయోజనం ఉండదని మహాత్మాగాంధీ వంటివాళ్ళకు తెలుసు. అంచేత, మరేం చెయ్యాలని ఆలోచించారు.



తెగిడితే బావుంటుందని కొందరు భావించారు. విసిగిస్తే మేలని మరికొందరు అనుకున్నారు. కోపం కలిగిస్తే మంచిదని ఇంకొందరు అనుకున్నారు.

కత్తిపట్టి కయ్యానికి కాలు దువ్విన వీరుల్ని బతకనిస్తే ప్రమాదమని బ్రిటిష్ పాలకులు తుపాకులు పేల్చారు. అహింసే పరమ ధర్మమని బోధిస్తూ గాంధీజీ శాసనోల్లంఘనం చేశాడు. విదేశీ వస్త్రాలు దహనం చేశాడు. ఉప్పు సత్యాగ్రహం చేశాడు. నిరాహారదీక్షలు చేయించాడు. బ్రిటిష్ పాలకులకు చిరాకెక్కించాడు.

ఎలాగైతేనేం స్వాతంత్ర్యం వచ్చింది. నిరాహారదీక్షల బలమూ తెలిసింది.

ఆంధ్రరాష్ట్రం కావాలని అడిగితే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేశాడు. ఆయన ప్రాణాలు ధారపోస్తే కానీ కేంద్రం ఆంధ్రరాష్ట్రాన్ని ఇవ్వలేదు.

అడిగితేనే కానీ అమ్మయినా పెట్టదనే నానుడి పాలకుల దగ్గర పనిచెయ్యదు. పారిశ్రామికుల దగ్గర అసలు పనిచెయ్యదు.

"మా పని గంటలు తగ్గించండి. మా జీతాలు పెంచండి" అని ఉద్యోగులు అడగ్గానే యాజమాన్యాలు "ఓ యస్ ఆల్ రైట్" అన్న దాఖలాలు లేవు. అంచేతే ప్యారిస్‌లో కార్మికులంతా మొదటిసారి సమ్మె చేశారు. ఆ సమ్మెలోని కార్మికుల ఐక్యత చూసి, ఉత్పత్తులు ఆగిపోవడం చూసి అక్కడి యాజమాన్యాలు కలత చెంది, దిగిరాక తప్పలేదు.

"ప్రపంచ కార్మికులారా ఏకం కండి" నినాదం విశ్వమంతా ప్రతిధ్వనించింది.

పనిభారమైతే, దాన్ని తగ్గించమంటూ సమ్మె. జీతాలు పెంచాలంటూ సమ్మె. ప్రైవేటు యాజమాన్యాలలోనే కాకుండా ప్రభుత్వ యాజమాన్యాలలోనూ ఉద్యోగుల ఆయుధం సమ్మెగానే కనిపించింది.

ఈ సమ్మెల్లో నిరాహారదీక్షలుంటాయి. ఆందోళనలుంటాయి.

అడిగితేనయినా ఇచ్చే అమ్మగా ఏ సంస్థా ఉండలేదు. ఆ కారణంగానే సమ్మె చెయ్యనిదే, ఆందోళన

చేపట్టనిదే, నిరాహారదీక్షకు పూనుకోనిదే ఏ పాలకులూ ఉద్యోగుల, ఇతర ప్రజల కోర్కెలు తీర్చలేదు.

"విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు" నినాదంతో స్టీలు ఫ్యాక్టరీని విశాఖపట్నంలో ఏర్పాటు కావడానికి ఆందోళన చెయ్యాల్సి వచ్చింది. అమృతరావు ఆమరణ నిరాహారదీక్షకు పూనుకోవాల్సి వచ్చింది.

పే కమిషన్ సిఫార్సు తమకు అనుకూలంగా అమలు చెయ్యాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులూ సమ్మెకు దిగుతామంటారు. అప్పుడు మాత్రమే ప్రభుత్వం దిగి వస్తుంది. విద్యుత్ బోర్డు సంస్కరణలు తమ శ్రేయస్సుకు వ్యతిరేకంగా ఉన్నాయని విద్యుత్ ఉద్యోగులూ సమ్మెకు దిగుతారు.

తమకు అన్యాయం జరిగిందని నిరసన తెలపడానికి మరో ఆయుధంగా ఆత్మహత్య కూడా అమలవుతోంది.

పత్తికి గిట్టుబాటు ధర రాక, దానికి అప్పోసప్పో చేసి పెట్టిన పెట్టుబడి తిరిగిరాక, చేసిన అప్పులు తీర్చలేక, గిట్టుబాటు ధర కల్పించని పాలకులకు పరోక్ష నిరసనగా కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అలాగే, అనావృష్టికి పంటంతా బూడిదయితే, కళ్ళముందు అప్పులు భూతాల్లా కనిపించి ఇంకొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంతవరకూ కదలని, మెదలని పాలకులు ఒక్కసారిగా మేల్కొన్నట్టు నటించి "కంటి తుడుపు"గా లక్షో అర లక్షో ఆయా కుటుంబాల వారికి ప్రకటించిన సందర్భాలున్నాయి.

ఇప్పుడు ఖమ్మం జిల్లా పాల్వంచలో జి.లక్ష్మి కూడా ఆత్మహత్య చేసుకుంది. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో కాంట్రాక్టులు చేసిన తన భర్త ఈశ్వరరావుకు రావలసిన సుమారు ఎనిమిది లక్షల రూపాయల బిల్లులు చెల్లించే వరకూ తన శవానికి దహన సంస్కారాలు చెయ్యవద్దని ఆమె నిరసన తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాసింది. అయిదు శాతం కమిషన్ ముందుగా ఇస్తేనేకానీ ఆ బిల్లులు పాస్ చెయ్యనని కెటిపిఎస్‌లోని అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ మొండిపట్టుపట్టాడనీ బిల్లులు పాసయ్యాక ఇస్తామన్నా ఊరుకోలేదనీ తన భర్త పడుతున్న మానసిక వేదనను చూసి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాననీ ఆమె వివరించింది. అధికార యంత్రాంగంలోని అవినీతికి ఇదో ఉదాహరణ.

"నా హత్యకు కారణమైన పరిస్థితుల్ని విచారించి నా కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చూడండి. అలా చేసేవరకూ నా శవానికి అంత్యక్రియలు జరగడానికి వీలులేదు" అని లక్ష్మి ముఖ్యమంత్రిని అభ్యర్థించింది.

కొందరు రైతుల ఆత్మహత్యల తర్వాత వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్టు, విచారణ జరిపించి లక్ష్మి కుటుంబానికి ముఖ్యమంత్రి న్యాయం జరిపించవచ్చు. అయితే, సమ్మెల్లాగే నిరాహారదీక్షల్లాగే, ప్రదర్శనల్లాగే, ఆత్మహత్యలూ న్యాయం కోసమూ, నిరసన తెలపడం కోసమూ "సంప్రదాయక ఆయుధాలుగా" మారే ప్రమాదం ఉంది.

ఆత్మహత్య మహాపాపం అన్నారు మన పెద్దలు. ఆత్మహత్య అత్యంత సిగ్గుమాలిన పిరికితనం అన్నవాళ్ళూ ఉన్నారు.

మరి, ఆత్మహత్యలకు దారితీసే పరిస్థితుల్ని కల్పిస్తున్న వాళ్ళనేమనాలి?

సమ్మెలకు దిగితేనో, ఆత్మహత్యలు చేసుకుంటేనో మాత్రమే న్యాయం చేయాలనుకునే పాలకులదే ఈ పాపం అంతా. అంతే కదా.

వార్త దినపత్రిక, 12-9-97